"ఇప్పుడే ఇచ్చివస్తున్నాను," అన్నాడు కమలాక్షుడు.

"అయితే వెంటనే వెళ్ళి, యమగృహాన్ని సోదా చేయ నవసరంలేదని చెప్పిరా. మానిక్‌మండల్ చెప్పినది అబద్ధం."

కమలాక్షబాబుకు అంతా అయోమయంగా ఉంది. అతను వెళ్లిపోయాడు. అతను కొంచెంసేపటికి తిరిగివచ్చి, ''నమోదు చేసిన కేసును రద్దుచెయ్యరుట. గోలోక సాహాను ఇనస్పెక్టరు స్వయంగా కలుసుకోవాలిట," అన్నాడు.

చంద్రకాంతుడు అప్పటికప్పుడే కలకత్తాకు ప్రయాణ మయ్యాడు.

రాత్రి బాగా పొద్దుపోయాక వహ్నికుమారి ఒక దాసీతోసహా పాలకిలో అరణ్యానికి బయలుదేరింది. ఆమె బంగళాదగ్గిర దిగేసరికి అక్కడ ఎవరూ లేరు. అరణ్యంమీద శుక్లఏకాదశిచంద్రుడు ప్రకాశిస్తున్నాడు.

"నువ్విక్కడే ఉండు. నేనిప్పుడే వస్తాను,'' అంటూ వహ్నికుమారి కదిలింది. దారిలో ఆమె తన పరిచారికకు ఏదో కథ అల్లిచెప్పింది _ తాను సంతానంకోసం ఏదో మొక్కుకున్నాననీ, ఆ మొక్కు ఒంటరిగా వెళ్ళి తీర్చాలనీనూ.

అలా వెళ్ళిన వహ్నికుమారి మరి తిరిగిరాలేదు

యమగృహంలో రెండు కాలసర్పా లున్నాయి.


* * * *

ఉగ్రమోహనుడిలోనూ, చంద్రకాంతుడిలోనూ ఆటే మార్పేమీలేదు. వాళ్ళు పట్టుదలగా చదరంగం ఆడుతూనేఉన్నారు. ఉగ్రమోహనుడు వహ్నిని గురించి చంద్రకాంతుడిదగ్గిర ప్రస్తావించడు.

చంద్రకాంతుడు ఉగ్రమోహనుడి మంత్రిమీదికి బంటును తోసి, "నీ మంత్రిని కాపాడుకో!'' అన్నాడు.

ఉగ్రమోహనుడు కొంతసేపు చదరంగంబల్లకేసి చూసి, ఆకస్మాత్తుగా తల ఎత్తి, "యమన్, పూర్వీ రాగాలమధ్య తేడా నువ్వెలా తెలుసుకుంటావు?" అని అడిగాడు,

చంద్రకాంతుడు నిర్ఘాంతపోయాడు.





తమిరిశ జానకి

ఉలిక్కిపడ్డాడు సారథి. ఆశ్చర్యంతో వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాడు. మెల్లిగా చూపులు పక్కకి తిప్పాడు. ఎడంచేతిని పిట్టగోడమీద ఆన్చి, కుడి చేత్తో డాబామీదికి వాలిన కొబ్బరాకుని మెల్లిగా ఊపుతోంది నిర్మల. ఆ రెండు చేతుల్నీ గట్టిగా పట్టుకుని, కళ్ళల్లోకి చూస్తూ, 'ఏవిటి నువ్వంటున్న' దని అడగాలనిపించింది సారథికి. "నిజంగానే చెప్తున్నావా?'' అన్నాడు చివరికి ఎటో చూస్తూ.

ఎప్పుడూలానే నవ్వింది నిర్మల. ముత్యాల్లా పళ్ళు మెరిశాయి.

అంత హాయిగా ఎలా నవ్వగలుగుతోందో అర్థంకాలేదు సారథికి.

ఇందులో అంత ఆశ్చర్యపోవలసిందేవుంది బావా? నాకు నిన్ను పెళ్ళి చేసుకోడం ఇష్టంలేదు. అంతే!'' స్థిరంగా వున్నా యా మాటలు.

"ఆశ్చర్యపోవలసింది లేదన్నందుకు క్షమించు," అంది మళ్ళీ ఒక నిముషం ఆగి.

"కారణ మేమిటో తెల్సుకోవాలనుంది కదు బావా!" ముఖంమీద పడుతున్న ముంగురుల్ని సవరించుకుంది.

అవును మరి. ఎందు కుండదు? మీ ఇద్దరూ భార్యాభర్త లని ఇంట్లో పెద్ద వాళ్ళు అదేపనిగా గోలపెట్టకపోయినా, అసలు చిన్నప్పటినుంచీ అనుకుంటున్నదేనయ్యే. అందరూ ఆమోదించిందే కూడా. అటువంటిది, ఇప్పుడు దాన్ని నిజం కాకుండా చెయ్యాలని చూస్తుంటే కారణ మేమిటో తెల్సుకోవాలని ఉండదూ?

"నా మనసులో ఉన్నదంతా నీకు వివరంగా చెప్పేస్తాను. చాలా సేపవుతుందేమో. కూర్చోడాని కేమయినా..." అంటూ మాట పూర్తి చెయ్యకుండా జవాబుకోసం చూసింది నిర్మల.

ఇలాంటి విషయాలు తీరుబడిగా కూర్చుని వినడం కష్టమనిపించింది సారథికి. అయినా తప్పనిసరిగా గోడ మీద కూర్చున్నాడు. "ఇలా కూర్చుంటాను."

తనుకూడా కొద్దిదూరంలో కాళ్లు నేల కాన్చి గోడమీద కూర్చుంది నిర్మల.

"నిన్నకూడా ఇలాగే వర్షం జోరుగా కురుస్తుందేమోనని అనిపించేలా మబ్బులు కమ్ముకున్నాయి. రెండు చినుకులు పడ్డాయంతే. ఏమీ ఎరగనట్టు మబ్బు లెక్కడికో పోయాయి. ఇవాళ కూడా ఆకాశం చూస్తుంటే పెద్ద వర్షం వస్తుందేమో ననిపిస్తోంది." ఆకాశంలో అల్లుకుపోతున్న నల్లటి మబ్బుల్ని వింతగా చూస్తోంది నిర్మల.

అసలు విషయం మాట్లాడక, వర్షం గురించీ, గాలిగురించీ కబుర్లు అనవసరం అనుకున్నాడు సారథి కానీ అత్రుత కనిపించనీయకుండా తన చూపులు దూరంగా కనపడే కొబ్బరిచెట్లమీదికి తిప్పుకున్నాడు.


నిర్మల చెప్పడం మొదలు పెట్టబోయింది. కానీ, ఇంతలో కిందనుంచి తల్లి పిలుపు వినిపించింది.

"అమ్మ పిలుస్తోంది. పార్వతి వొచ్చిందట. దాంతోటి కొంచెంసేపు మాట్లాడి వొచ్చేస్తాను. ఆకాశాన్నీ, చెట్లనీ చూస్తూ నువ్వెక్కడికీ ఎంత సేపయినా కూర్చోగలవుగా;" నవ్వుతూ మెట్లు దిగుతోంది నిర్మల వయ్యారంగా. అడుగులకి సరిపోయేలా వెనకాల కదిలే పొడుగాటి జడని పట్టుకు లాగా లనిపించింది సారథికి. ఆ ఆలోచన రాకూడదన్నట్టుగా వెంటనే నిర్మల మాటలు వినిపించాయి చెవుల్లో. 'నాకు నిన్ను పెళ్ళి చేసుకోవాలని లేదు.'

హృదయంలో పొంగేబాధ నణచిపెట్టి ఆలోచించడం మొదలుపెట్టాడు సారథి......

అసలు తనని పెళ్ళి చేసుకోవాలని లేకపోతే ఇన్నాళ్ళుగా - ఎప్పుడూ ఆ సంగతి బయటపెట్టలే దెందుకని?





"సోమూ! నీ చెయ్యి ఎలా విరిగిందిరా?"
"అదిగో ఆ మెట్లు కనిపిస్తున్నవా?"
"చక్కగా కనిపిస్తున్నాయి."
"నా కవి కనిపించలేదు, అంతే!"

ఈ మాట వింటే అమ్మ ఎంత బాధ పడుతుంది. ఈ చేదునిజం తెల్సుకోడానికేనా తను, నిర్మల రమ్మందన్న కబురు వినగానే ఉరుకులు పరుగులమీద వచ్చాడు? అసలు నిర్మల ఈ నిర్ణయానికి రావడానికి కారణం ఏమైవుంటుంది? ఎవరినైనా ప్రేమించిందా? ఒకవేళ అలాంటి దేమైనా ఉంటే ఊళ్ళోనే ఉండే తనకి చూచాయగానైనా తెలియకపోతుందా? ఏమో తెలియకపోయినా తెలియకపోవచ్చు. ఎవరు చెప్పగలరు?

అయినా ఎవరినైనా ప్రేమించిందేమో నన్న ఆలోచనకి అతని మనసులో ఎక్కువ తావులేకపోయింది. ఆ ఊహని దూరంగా ఉంచాడు.

"వచ్చేశాను," అంటూ వచ్చి పైట నడుంచుట్టూ తిప్పి దోపుకుని గోడమీద కూర్చుంది నిర్మల. ఒకనిమిష మాగి మెల్లిగా అంది–"నువ్వు బాధపడుతున్నావనుకుంటాను. నాకూడా బాధగానే ఉంది–నీతో ఇలా చెప్పవలసి వచ్చినందుకు. ఇన్నాళ్ళూ ఈమా టెందుకు చెప్పలేదని నీకు సందేహం వచ్చిం దనుకుంటాను. మొదటదానికి జవాబు చెప్తాను. ఇంతవరకూ అవసరం రాలేదు కాబట్టి చెప్పలేదు. నువ్వయినా ఎప్పుడూ

నా ఎదుట మనిద్దరం పెళ్ళి చేసుకోబోయే వాళ్ళం అన్న పుద్దేశం బయటపెట్టలేదు. అలా చేసివుంటే నేను వెంటనే నా అభిప్రాయం చెప్పిఉండేదాన్ని. నీకే కాదు, ఎవరికీ చెప్పలేదు. ఇప్పుడు రెండు రోజుల్నించీ ఈ ప్రసక్తి పెద్దవాళ్ళ మాటల్లోకి వస్తూండటంవల్ల చెప్పడం నాకు తప్పనిసరయింది. ఈ ఉదయం నా నిర్ణయం అమ్మకి చెప్పగానే కోపం వచ్చింది. సరిగ్గా ఆలోచించుకోమంది. అందుకే అనుకున్నాను – వాళ్ళతో చెప్పి లాభం లేదు. తిన్నగా నీతో చెప్పడమే నాకు మంచిదని.''

అదురుతున్న గుండెల్ని అదుపులోకి తెచ్చుకోలేక అవస్థపడుతున్నాడు సారథి. ఏం వినవలసివస్తుందో నని మనసు అల్లల్లాడుతోంది.

చివర కొద్దిగా ఊడిన జడని ముందు కేసుకుని అల్లుకుంటూ అంది నిర్మల– "నువ్వు అతిమంచివాడివి. అదీగాక ఖచ్చితమైన మనిషివి. నీ అతిమంచితనం చూస్తే జాలేస్తుందితప్ప ప్రేమించలేను."

తలెత్తలేకపోయాడు సారథి. ఎంత సేపటినించో అణచిపెట్టుకున్న బాధ కన్నీటిరూపం దాల్చింది.


"నీ మంచితనంవల్ల లాభం పొందే వాళ్ళే నీ వెనక నిన్ను హేళన చేస్తూ ఉంటారు. నువ్వాసంగతి గుర్తించలేక పోతున్నావ్. అందరూ నీ అంత మంచి వాళ్ళే అనుకుంటావు నువ్వు. వారం రోజులక్రితం బజార్లో నీ చెప్పు కుట్టించుకున్నావు. ఆరో జేమయిందో జ్ఞాపకం ఉందా?" అంటూ ఆరోజు జరిగిన సంఘటన వివరిస్తూ చెప్పింది నిర్మల.

"ఆ చెప్పులు కుట్టేవాడు మొదట రెండణాలకి కుడతానని చెప్పి అంతా అయిన తర్వాత నువ్వు రెండణా లిస్తే పుచ్చుకోకుండా పావలా ఇవ్వమని పేచీ పెట్టాడు మరి మొదట రెండణాలే అని చెప్పి ఇప్పుడు పావలా ఇవ్వమనడ మేమిటని నువ్వు పావలా ఇవ్వడానికి ఒప్పుకోలేదు. వాడేమో అరుపులు మొదలు పెట్టాడు. రోడ్డుమీది జనం నీచుట్టూ చేరి వింతగా చూస్తున్నా నువ్వు పట్టించుకోలేదు. అప్పుడే నే నటువైపు వచ్చాను కాబట్టి కానీ లేకపోతే ఇంకా ఎంత సేపు మీ దెబ్బలాట ఉండేదో!

"'ఇదేమిటి బావా రెండణాలకోసం వీడిచేత మాటలుపడటమేమి'టని నేనంటే 'మనం చేసేపనీ, మాట్లాడేమాటా వంక పెట్టలేనిదిగా ఉండాలి–అన్న మాటమీద నిలబడటం ప్రతివాడూ నేర్చుకోవాలి' అన్నావు నువ్వు."

మెల్లిగా అన్నాడు సారథి తల వంచుకుని "ఔను. నేను వాడికి పావలా ఇవ్వలేకకాదు. వాడితో ఏమిటిలే అని నేను వాడడిగినంతా ఇచ్చి వెళ్ళిపోతే, వాడొక్కడేకాదు, అలాంటివాళ్ళందరూ కూడా ప్రతివాడిదగ్గిరా అలాగే గొడవ మొదలుపెడతారు. ఉన్నవాళ్ళు ఇస్తారు.





సరేకానీ ముందర ఒక ధర చెప్పి తరవాతొకటి చెప్తే లేనివాళ్ళేం చేస్తారు. పాప పుణ్యాలు విచారించేటప్పుడు దేవుడు వీడు బీదవాడు, వీడు గొప్పవాడు అని చూడడుగా. అందుకే మనంకూడా పోన్లే వీడు బీదవాడు అన్యాయం చేస్తే చేశాడు అని ఊరుకోడం మంచిదికాదు."

అదేమీ వినిపించుకోనట్టే అడిగింది నిర్మల – "అసలు అందరూ నీ చుట్టూ చేరితే, నలుగురూ చూస్తున్నారని నీకు నామోషీ అనిపించలేదూ?"

తడుముకోకుండా సమాధానం చెప్పాడు సారథి: "ఎందుకు? నే నేమీ భయపడాల్సిన పనికానీ, సిగ్గుపడాల్సిన పనికానీ చెయ్యనప్పుడు నామోషీ ఎందుకు?"

"అదేకనక మా గోపీ అయితే వాడెంతడిగితే అంత పడేసిపోతాడు." గర్వంగా చూసింది నిర్మల.

'ఔను. అలాంటివాళ్ళుండబట్టే

మొన్న వాడలా అడిగాడు నన్ను.' మనసులోనే అనుకున్నాడు సారథి.

డాబామీదికి పాకుతున్న మాలతీలత గాలిలో అందంగా ఊగుతోంది. సువాసన అందించి గాలి నాహ్వానిస్తోంది. సువాసన నింపుకుని పరిగెడుతున్న గాలి నిర్మల ముంగురుల్ని పలకరిస్తోంది.

ఒక్కక్షణం మాలతీపూల అందాన్ని మైమరచి చూసింది నిర్మల. ఒక్కక్షణం మాలతీపూల సున్నితమైన సువాసనని బాధంతా మరచి మత్తుగా పీల్చాడు సారథి.

"నిన్ను మా అమ్మ దేవుడిలాంటి వాడివంటుంది. చాలామంది నిన్ను దేవుడివని పొగుడుతూఉంటారు కదూ! మనుషుల్లో మనిషిగా బ్రతకడమే నా కిష్టం. దేవుడనిపించుకో నక్కర్లేదు. దెయ్య మనిపించుకోనక్కర్లేదు. అయితే మనుషుల్లో దేవుడిలాంటివాళ్ళుండకపోతే ఈ ప్రపంచం నిలుస్తుందా? అనడిగితే దానికి నే నేం చెప్పలేను. అవన్నీ పెద్దపెద్ద వాదాలు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. నేను చెప్పిందే నువ్వుకూడా ఒప్పుకోవాలని అనను."

ఏమి మాట్లాడటానికీ మనస్కరించక, మాట్లాడకుండానూ ఉండలేక మధ్యలో నలుగుతున్నాడు సారథి.

"హాయిగా సంపాదించుకుంటున్న వాడివి ఒక్క సినిమా అయినా చూడవు. ఎప్పుడైనా ఎవరైనా బలవంత పెడితే తప్పనిసరిగా వెళ్తావు. మా గోపీలాగా సరదాగా ఉండాలి, తిరగాలికానీ..." అంటూ సగంలోనే ఆపింది నిర్మల.

"గోపీ... రోజూ తప్పకుండా క్లబ్‌కి వెళ్ళి జేబులు ఖాళీ చేసుకుని వచ్చే గోపీ... వారానికో సినిమా చూసే గోపీ... రోజుకి కనీసం మూడుసార్లైనా హోటల్ ముఖం చూడందే నిద్రపోలేని గోపీ–నిముషమైనా సిగరెట్టు నోట్లో లేందే గడపలేని గోపీ... ఆ గోపీలా ఉండాలా తను? గొంతు పెగుల్చుకున్నా మాట బయటికిరాలేదు సారథికి. ఇంక అక్కడ ఒక్కక్షణం ఉండలేకపోయాడు. గబగబా అడుగులువేస్తూ ముందుకి నడిచాడు. మెట్లు దిగబోతూ ఒకసారి వెనక్కితిరిగి చూశాడు.

"వెళ్ళిపోతున్నావా?" వెళ్తున్నానని చెప్పకుండానే సారథి వెళ్ళుతుంటే, ఆశ్చర్యం కలగలేదు నిర్మలకి.

ఔనన్నట్టుగా తలఊపి గబగబా మెట్లుదిగాడు సారథి. వెనకనుంచి నిర్మల ఏదో అంటున్నా వినిపించుకోలేని స్థితిలో.

తర్వాత నెల్లాళ్ళకే శంకరంతో నిర్మల పెళ్ళి అయిపోయింది.

అత్తవారి ఊరెళ్ళిపోయింది నిర్మల.

అదోలా అయిపోయాడు సారథి. ఎప్పుడూ తనమీద తనకే అర్థంలేని కోపం, విసుగూ వస్తుండేవి.

ఇష్టంలేకపోయినా రోజూ క్లబ్‌కి వెళ్తూ, బలవంతంగానైనా వారానికో సినిమా తప్పకుండా చూడాలని అనుకున్నాడు మొదట్లో. ఆవేశంతో, కోపంతో, బాధతో. కానీ ఆ ఆవేశం, బాధా, కోపం చల్లారిపోయాయి. బాగా ఆలోచించినమీదట, "ఒక ఆడదాని మాటలకోసం లేనిపోని అలవాట్లు తనెందుకు చేసుకోవాలి, తనకిష్టం లేకపోయినా?" అనుకున్నాడు బాగా ఆలోచించి. కానీ నలుగురితోనూ సరదాగా మాట్లాడలేకపోతున్నాడు. మౌనంగా, భారంగా కాలం గడుపుతున్నాడు.

"ఇదేమిటి వీడిలా అయిపోతున్నాడు," అనుకుంది తల్లి.

"వీడి కేదో అయింది''అనుకున్నారు స్నేహితులు.

''సారథి చాలా మారిపోయాడు,'' అనుకున్నారు ఊళ్ళోవాళ్ళు. నాలుగైదు నెలల తరవాత గుంటూరు ఏదో పనిమీద వెళ్ళినప్పుడు స్టేషన్లో, ఇంకో అయిదారు నిముషాల్లో బయల్దేరబోతున్న ట్రయిన్లో నిర్మలని చూశాడు సారథి. నిర్మలకూడా సారథిని చూసి చెయ్యి ఊపింది కిటికీలోంచి. నిర్మల కూర్చున్న కంపార్టుమెంటుదగ్గరికి నడిచాడు. కిటికీదగ్గరగా జరిగి కూర్చుంది నిర్మల.

కుశలప్రశ్న లయ్యాక, ఆ ఊళ్ళో ఉన్న తన స్నేహితురాలి పెళ్ళికి వచ్చి వెళ్తున్నట్టు చెప్పింది నిర్మల.

ఏం మాట్లాడాలో తెలియక వాచీ చూసుకున్నాడు సారథి.

"మనుషుల్లో దేవుడిలాంటివాళ్ళుండటము చాలాఅరుదనీ. వాళ్ళింతో పుణ్యం చేసుకునిఉంటారనీ ఆయనంటూ ఉంటారు. నిజంకదూ!" ఉన్నట్టుండి నిర్మల నోటినుంచి వచ్చిన ఆ మాటలు విని తెల్లబోయాడు సారథి.

"మొన్న మాగోపీకి ఉత్తరంలో ఏమని వ్రాశానో తెలుసా? మరీ విచ్చలవిడిగా ఖర్చుచెయ్యకు. పొదుపుగా వాడటం నేర్చుకోమని వ్రాశాను;'' చిన్నగా నవ్వింది నిర్మల. సారథికళ్ళు ఆశ్చర్యంతో మెరిశాయి.

పచ్చజెండా చూసి పెద్దగా కూసింది రైలు.

'ఆడది పెళ్ళికాకముందు ఉన్నట్టు పెళ్ళైనతర్వాత ఉండదనీ, ఇంకొకరి అభిప్రాయాలకి అనుగుణంగా తన అభిప్రాయాల్ని మార్చుకుంటుందనీ' అనుకున్నాడు సారథి మనసులోనే.

నిర్మల కళ్ళు తుడుచుకుంది పక్కకి తిరిగి. సారథి చూడడం లేదనుకుంది. కానీ సారథి చూడనేచూశాడు. రైలు ముందుకు కదిలింది.

పరిగెడుతున్న రైలును చూస్తూ అలాగే నిలబడ్డాడు సారథి. కళ్ళు తుడుచుకుంటున్న నిర్మలరూపమే కళ్ళ ముందు కదుల్తోంది. ఎందుకు? ఎందుకా కన్నీరు?

'ఈ ప్రపంచంలోకల్లా అతి విచిత్రమైన దేది?' అని తనని తనే ప్రశ్నించుకుని, 'స్త్రీ' అని జవాబు చెప్పుకుని భారంగా అడుగులు వేశాడు సారథి.